సీరియల్

[పదునెనిమిదవ భాగము]

హఠాత్తుగా "ఎవరక్కడ?" అన్నమాటా, ఆ మాటతోపాటు పెద్దటార్చికాంతి—పదిహేను గజాల దూరంలో.

"అందరూ—క్విక్" అని వెనక్కి తోసాను.

మరుక్షణంలో నలుగురం వో యిసుకదిబ్బ వెనకాల వున్నాం.

టార్చికాంతి అటూయిటూ కదుల్తూ, ఖాసిం శవం మీదపడి నిల్చిపోవడం గమనించాను.

కళ్ళు చిట్లించి బాటరీలైట్ వ్యక్తివేపు చూసాను—

కాపలా గార్డ్ — మెళ్ళో రైఫిల్ — తలకు శిరస్త్రాణం.

ఖాసిం శరీరం మీదకు రైఫిల్ కొనమోపి, "పైకి లే! ఎక్కడికి పారిపోలేవ్" అన్నాడు కర్కశంగా గార్డ్.

రెస్పాన్స్ రాకపోవడంతో అనుమానంగా వంగి ఖాసిం దేహాన్ని పరీక్షించ సాగాడు.

సరిగ్గా అదేసమయంలో!

బూటుకాల్లోని చురకత్తి కోసం, చేయి దింపాను.

నాచేయి పైకిలేచే లోపుగానే 'టుప్' మన్న శబ్దం వినబడింది.

"మ్మ్..." అన్న మూలుగుతో గార్డు నేలమీద కూలి పోయాడు.

"శాన్యోం!" అన్నాను నాచేతులు చీకటిలో ఆడిస్తూ.

"సారీ మేజర్! మీ అనుమతి వుండాలో లేదో తెలియదు. గార్డుని చంపాను." శాన్యోరా కంఠం గంభీ రంగా వినబడింది.

"అఫ్‌కోర్స్ ఫాస్ట్ యాక్షన్! గుడ్ గర్ల్!" అని మాత్రం అన్నాను.

చీకట్లో నాచేతికి, ఆమె చేతిలోని సైలెన్సర్డు యిటా లియన్ రెబెట్టా చల్లగా తగిలింది.

తిరిగి నలుగురం చైనీస్ స్థావరం యెడమప్రక్కకు పాక్కుంటూ వెళ్ళాం.

శాన్యోరాకు సైగ చేశాను.

ఆమె చేతిలో కట్టింగ్ ప్లెయర్ ప్రత్యక్షమయింది. రెండునిముషాల్లో బార్బ్‌డ్ వైర్ ఫెన్సింగ్ రెండు గజాల మేర, కట్ అయి మనిషి దూరేంత ఖాళీ ఏర్ప డింది.

"మీరంతా యిక్కడే వుండండి. వాకీ-టాకీద్వారా నేను మెసేజ్ యిచ్చిన తర్వాత మీరు లోపలికి ప్రవేశించాలి. ఎవరయినా ఎదురయితే సాధ్యమయినంతవరకు చప్పుడుగాకుండా చంపండి." హెచ్చరించి ఖాళీలోంచి లోపల్కి అడుగుపెట్టాను.

"భయంకర్! ప్లీజ్ బి కేర్‌ఫుల్!"

వెనుకనుంచి శాన్యోరా హెచ్చరించింది.

వంగి, ముందుకి గబగబ నడవసాగాను...

ఓ గుడారం పక్కగా నిలబడ్డాను.

తల నేలమీదకువంచి లోపలికి చూశాను.

మనుషుల అలికిడి లేదు ఆ గుడారంలో.

లోపల సన్నగా లాంతరు వెలుగుతోంది.

అందులో నాలుగయిదు ఒంటెలున్నాయి.

అంటే ఒకవిధంగా అది పశువులశాల అన్నమాట.

జర్కిన్ బరువుగా ఎత్తుగా వుంది.

అందులో వాకీ-టాకీ ఇంకా ఇతరసామగ్రి వున్నాయి.

మెల్లిగా గుడారంలోకి ప్రవేశించాను.

ఒంటెలనడ్డుగా చేసుకొని అవతలవైపు మైదానంకేసి పరిశీలనగా చూశాను.

అర్ధకాంతి ఆవరణమీద పడుతోంది.

చటుక్కున చీకట్లోకి తప్పుకున్నాను.

మిలిట్రీ యూనిఫారంలో వున్న యిద్దరు వ్యక్తులు సిగరెట్లు పీలుస్తూ, మాట్లాడుకుంటూ ముందుకు వెళ్ళిపోయారు.

ఎలా ప్రవేశించాలి భవనంలోకి?? తీవ్రంగా ఆలోచించి యిక కదుల్దామనుకుంటుండగా, వో గార్డువచ్చి యెదురుగావున్న వో స్టూలుమీద అలసటగా కూర్చున్నాడు.

తలవంచి అతను సిగరెట్ ముట్టించుకున్నాడు. సిగరెట్ పీలుస్తూ అతను వోసారి అటూయిటూ చూసాడు ఊపిరి బిగబట్టి నిలబడి, చూస్తూండిపోయాను. అంతలో వో ఆలోచన, మస్తిష్కంలో తళుక్కున మెరిసింది.

పెరాబుల్లమ్ పిస్టల్ మొనతో ముందున్న ఓ ఒంటెను బలంగా పొడిచాను.

ఒంటె చిన్నగా అరుస్తూ ముందుకు గెంతింది.

ప్రక్కకుజరిగి రెస్పాన్స్‌కోసం గార్డ్ వేపు చూసాను. అతను గుడారంవైపు ఓసారి చూసి మళ్ళీ సిగరెట్ పీల్చడంలో మునిగిపోయాడు.

నా ప్రయత్నం ఫలించలేదు.

గుడారంలో మూడోంతులు చీకటిగా వుంది.

మెల్లిగా కదిలి, గుడారం గుమ్మంవైపు వెళ్ళకుండా, ఎడంవైపు నిలబడ్డాను.

"అ...బ్బా..."...అంటూ పెద్దగా మూల్గాను.

చెవులు రిక్కించాను!!

బూట్ల అలికిడి అయింది!!

మెల్లిగా దగ్గిరయింది... గుమ్మంవద్దకు వచ్చి ఆగిపోయాయి బూట్లు...

"మ్మ్..." మరోసారి మూల్గాను.

బూటువాళ్ళు లోపలికి రావడం, టార్చిలైటుకాంతితో పాటు అతను నావేపు తిరగడం, వరుసగా జరిగాయి.

అంతే!

సైలన్సర్ బిగించబడిన నా చేతిలోని 9 యం.యం. వాల్తర్ పెరాబుల్లమ్ నుండి "స్సన్..." మనే ధ్వని వెలువడింది.

గుండు సూటిగా అతని మెదడులోకి చొచ్చుకు

పోవడం, అతను బరువుగా వాలిపోవటం ... అంతా క్షణాల్లో జరిగిపోయింది.

శవాన్ని, బాగా, లోపలికి లాగేసాను.

మరో అయిదు నిముషాల్లో నేను సెంట్రీ దుస్తులు ధరించాను.

జేబులు తడిమిచూడగా ఓ టోకెన్ కనబడింది. పైకి తీసాను. యిత్తడి బిళ్ళ అది.

99 అన్న అంకె ముద్రించబడి వుంది.

టోకెన్‌ను తిరిగి జేబులో వేసుకొని, తలమీద కాప్ బాగా, నుదుటిమీదకు లాక్కున్నాను.

భుజాన్ని వేలాడుతున్న మెషిన్ గన్ ఊపుకుంటూ, హుందాగా బిల్డింగ్ వేపు నడవసాగాను.

నా గుండెలు దడదడలాడుతున్నాయి. ఏమాత్రం అనుమానం వచ్చినా నన్ను పిచ్చికుక్కలా కాల్చి చంపుతారు.

గార్డ్ వేషంలో సెక్యూరిటీ బిల్డింగ్ ప్రక్కగా ఆగి ఓరగా ముఖద్వారంవైపు చూసాను. విషయం అర్థమైంది.

గుమ్మంవద్ద ఓ వాచ్‌మన్ కాపలావున్నాడు. అతని ఎదురుగావున్న స్టూలుమీద నాలుగయిదు టోకన్లున్నాయి.

అంతే! ఇక ఆలశ్యం చేయలేదు.

ఒక చెయ్యి పొట్టమీద, మరోచేయి గొంతుమీద అదుముకొని గబగబా అడుగులు వేసాను.

"నైట్‌డ్యూటీ గార్డ్‌వి. ఈ సమయంలో లోపలేం పనిరా?" వాచ్‌మన్ యింకా ఏదో అనబోతుండగా—

తలవంచుకొనే డోక్కోడాన్కి సిద్ధంగా వున్నట్లు శబ్దాలుచేస్తూ. "ప్లీజ్! డాక్టర్‌రూంకి వెళ్ళాలి. వాంతులు వస్తున్నాయ్." అంటూ తొంభైతొమ్మిదో నంబరు టోకెన్

అతని చేతిలో పెట్టి, సమాధానం ఆశించనట్లు గబగబా లోనికి నడిచాను.

వాచ్‌మన్ యింకేమీ అభ్యంతరం చెప్పలేదు. "దేవుడులాంటి మావో మరణించినప్పుడుకూడా మనకి డ్యూటీ తప్పలేదు" అన్న సానుభూతి వాక్యం వినబడింది వెనకనుంచి.

అదృష్టం నావేపు వుందన్నమాట.

డాక్టర్ రూం నిజంగా భవంతిలో లేకపోతే, నన్ను ఖచ్చితంగా అనుమానించేవాడు వాచ్‌మన్.

పైకి వెళ్ళేముందు మెట్లు కనబడ్డాయి. పైకి లంఘించాను.

మొదటి అంతస్తు వరండాలోకి ప్రవేశించగానే, రెండో అంతస్తు మెట్లు దిగుతూ ముగ్గురు మిలిటరీ వ్యక్తులు కనబడ్డారు. చటుక్కున గోడవారగా చీకట్లో నక్కాను.

వాళ్ళు ముగ్గురూ మాట్లాడుకుంటూ క్రింది ఫ్లోర్‌లోకి వెళ్ళిపోయాక భారంగా ఊపిరి వదిలి పై అంతస్తువేపు అడుగులు వేసాను.

గదుల బయటవున్న సైన్‌బోర్డులు చదువుకుంటూ ముందుకి నడిచాను.

ఓచోట నా కాళ్ళు ఠక్కున ఆగిపోయాయి. 'లాబొరేటరీ' అన్న బోర్డు అగపడింది. ప్రక్కకి చూసాను, 'ప్రైవేట్ రూమ్. ప్రొఫెసర్ హ్యాంగ్ హో'. అని వ్రాయబడ్డ సైన్‌బోర్డు చూసి నాలో ఆనందం ఉరకలు వేసింది. గుండెలు అతి వేగంగా కొట్టుకోసాగాయి.

గది తలుపులముందాగి మెల్లిగా తోసాను.

తెరుచుకోలేదు.

లోపల బోల్ట్ చేయబడి ఉందన్నమాట.

సన్నగా మాటలు వినిపిస్తున్నాయి.

ప్రక్కకి కదిలాను — కిటికీ-

థాంక్ గాడ్! కిటికీ తలుపులు దగ్గరగా వేయబడి ఉన్నాయి. వ్రేలితో కిటికీ తలుపులు అంగుళం లోపలికి తోసాను. చెవులు రిక్కించాను. సన్నగా వినబడుతోంది లోపల్నుంచి సంభాషణ.

క్లియర్‌గా వినలేకపోతున్నాను.

మిలిట్రీచొక్కా లోపల ధరించిన, జర్కిన్ పాకెట్ లోకి చెయ్యి జొనిపాను. మరుక్షణం నా చేతిలోకి హియరింగ్ ఎయిడులాంటి వస్తువు ప్రత్యక్షమైంది.

మధ్య వైర్ — అటూ ఇటూ రెండు గుండ్రటి బొడిపెలు.

ఒకవైపు బొడిపెను (రిసీవర్) నా చెవిలోకి దూర్చుకొని వైర్‌కి కనెక్టు చెయ్యబడ్డ రెండోవైపు బొడిపెను (మైక్రోఫోన్) కిటికీ తలుపు సందుగుండా లోనికి తోశాను.

ఇప్పుడు లోపలి మాటలు నా చెవులకి క్లియర్‌గా వినబడసాగాయి.

"ఏమిటీ మీరనేది?" ఆశ్చర్యంగా పలికింది ఓ కంఠం.

"ఎస్. ప్రొఫెసర్ హోయాంగ్ హో! భారతదేశాన్ని వరదల్లో ముంచెయ్యాలి. ప్రకృతిశక్తులనే చేజిక్కించుకున్న అపూర్వ మేధావులు మీరు. అదే — శక్తితో నిరంతర కుంభవృష్టితో భారతదేశాన్ని భీభత్సం పాలు చేయండి. ఈ దెబ్బతో వారి పంటలన్నీ నాశనమవ్వాలి. — ప్రభుత్వం గడ గడలాడిపోవాలి దిక్కుతోచని పరిస్తితుల్లో."

"మేజర్ చావో! డిసీజ్ టూమచ్. ఈ విషయం

ముందర చెప్పలేదు నాకు. విప్లవకారుణ్ణి కాదు నేను. విశ్వ కల్యాణాభిలాషిని.''

''మనదేశం పాడిపంటలతో విలసిల్లుతూ, సస్య శ్యామలం కావడానికి మాత్రమే నేను మీకు ఉపయోగ పడతాను.''

''క్షమించాలి ప్రొఫెసర్! యిది ప్రభుత్వపుటాజ్ఞ. ఈరోజే మీ ప్రయోగం విజయవంతమైంది. అందుకే యిప్పుడు చెప్తున్నాను. మీ అపూర్వశక్తులతో యిండియాని చైనాకి దాసోహమనిపించాలి'' చావో కంఠం.

''యింపాజిబుల్. నా కంఠంలో ప్రాణముండగా ఇది జరగదు.''

''ఈ అనంత విశ్వంలో ఏ మానవుడ్ని—భయభ్రాంతులకి గురిచేసి నాశనం చేసే అధికారం నాకు లేదు. నా సేవలు మన చైనాదేశ ప్రజలు వుపయోగించుకొనే విషయంవరకే పరిమితం.''

''మిస్టర్ - హోయాంగ్ హో! మీతో నీతి-స్నేహం-విశ్వమానవ సౌభాతృత్వం గురించి చర్చించే అవకాశం, అధికారం, నాకు లేదు. ఐయామ్ జస్ట్, ఒబేయింగ్ మై సుపీయర్స్ ఆర్డర్స్. నాపై జారీచేయుబడిన ఆజ్ఞలను నేను పాటించక తప్పదు. పిచ్చి వుపన్యాసాలు యిచ్చి, దేశద్రోహి కావద్దు.అనవసరంగా ప్రాణాలుపోగొట్టుకోవద్దు.''

''వ్వాట్? నన్ను చంపడమా? మీకు పిచ్చిపట్టి వుండాలి. లేకపోతే ప్రకృతి శక్తులను గుప్పిట్లో ఇరికించు కున్న, ఏకైక వ్యక్తితో ఈ విధంగా మాట్లాడరు.''

ప్రొఫెసర్ ఆవేశంతో ఊగిపోతున్నట్లు గమనించాను.

''అయామ్ సారీ ప్రొఫెసర్! బాగా ఆలోచించు

కోండి. దేశద్రోహం నేరాన్ని మీ పై రుద్దుకోవద్దు. తీవ్రంగా ఆలోచించండి. మన ప్రభుత్వం ఎంత కఠినమైనదో మీకు తెల్సు. మళ్ళీ రేపు వుదయం కలుస్తాను... గుడ్ నైట్!''

చటుక్కున ట్రాన్స్మిటింగ్ సాధనాన్ని బైటకిలాగి, వరండా వారగా చీకట్లోకి దూకాను.

తలుపు తెరుచుకున్న చప్పుడు—

ఆఫీసర్ దుస్తుల్లోని మేజర్ చావో బైటకివచ్చాడు. ఊపిరి బిగపట్టి అతన్ని పరీక్షిస్తూ అలాగే నిలబడిపోయాను.

వరండాలో నిలబడి, సిగరెట్ ముట్టించుకొని, పెద్ద పెద్ద అంగల్తో మెట్లవేపు నడిచాడు మేజర్ చావో.

చటుక్కున ప్రొఫెసర్ గదిలోకి చొరబడ్డాను. విశేషమైన తలుపు చప్పుడుకి టీ త్రాగుతున్న ప్రొఫెసర్ హోయాంగ్ హో ఉలిక్కిపడి చూసాడు.

''ఎవరునువ్వు?'' అన్నాడు కంగారుగా, జేబులో చెయ్యి పెట్టబోతూ.

మెషిన్ గన్ అతనికేసి గురిపెట్టాను: ''మీ చేయి వెనక్కి తీసుకోండి ప్రొఫెసర్! విశ్వమానవ సౌభ్రాతృత్వంకోరే పూజనీయులకు మారణాయుధాలతో పని లేదనుకుంటూ. నా చేతిలోని యీ మెషిన్ గన్ మీకు సంబధించినంత వరకూ ఏ అపకారము చెయ్యదు.''

చెయ్యి వెనక్కి తీసుకొని ప్రొఫెసర్ నన్ను పరిశీలించసాగాడు. ''మరో ప్రపంచ సంస్థ మీకు స్వాగతం పలుకుతోంది. అయామ్ మేజర్ భయంకర్—ఇండియా నుంచి పారిపోయి మిమ్మల్ని కల్సుకోడానికి యింత దూరం వచ్చాను.'' అంటూ చెప్పసాగాను.

*　*　*

"నీ మాటలు నమ్మటం ఎలా?'' — అన్నాడు ప్రొఫెసర్ హోయాంగ్ హో నా సుదీర్ఘ వుపన్యాసం విన్న తర్వాత.

"సాక్ష్యాలు చూపిస్తాను ప్రొఫెసర్! కానీ ఓ విషయం మీరు నమ్మాలి. నేను ఓ దోపిడి ముఠానుండి కాని సంఘ వ్యతిరేక శక్తుల తరఫునగానీ ఎన్నో వేల మైళ్ళు అతి కష్టంతో ప్రయాణించి, యింతదూరం రాలేదు. కొత్త ప్రపంచ సాధనకొరకు, N. W. O. సంస్థతరఫున మీ చేయూత కావాలని ప్రార్థిస్తున్నాను'' అన్నాను గంభీరంగా.

జర్కిన్ జిప్పర్ లాగి, లోపల్నుంచి ఓ ఆల్బమ్‌లాంటి పుస్తకం తీసాను.

రెండు నిముషాలపాటు, పేజీలు ఆసక్తిగా, తిరగేసాడు ప్రొఫెసర్.

అందులో — ప్రతీ పేజీలో - న్యూ వరల్డ్ ఆర్గనైజేషన్‌లో - పనిచేస్తున్న ఒక్క సైంటిస్టు ఫొటో— వారి వివరాలు— N. W. O. ఆశయాలను సమర్థిస్తూ మేధావుల కామెంట్స్, వరుసగా సంతకాలతో సహా పొందుపరచబడ్డాయి.

నూతన ప్రపంచ స్థాపనలో ప్రొఫెసర్ హోయాంగ్ హో — ఏ సందేహాలు లేకుండా వెంటనే చేయూత ప్రకటించి 'న్యూవరల్డ్' అనే తియ్యటి కలను నిజం చేయమని అభ్యర్థిస్తూ అనేక దేశాల సైంటిస్టులు సంతకాలు చేసిన పర్సనల్ లెటర్స్ కూడా చదవడం ముగించాడు హోయాంగ్-హో.

పుస్తకం మడిచిన, ప్రొఫెసర్ కళ్ళలో ఆనంద బాష్పాలు వెలువడ్డం నాకెంతో ఆనందం కల్గించింది.

"మిస్టర్. భయంకర్! నిన్న - మీ సంస్థను, మీ సంస్థ ఆశయాలను ఇప్పుడు హృదయపూర్వకంగా నమ్ము తున్నాను. ఏ దేశంలోని పౌరుడికైనా తినడానికి తిండి, వుండడానికి ఇల్లు - ఆస్తులు వున్నా - యుద్ధభయం మాత్రం విశ్వమానవుడ్ని నిరంతరం వెన్నాడుతోంది. ఆ భయం పోగొట్టే ఏకైక సంస్థ మీ ఎన్.డబ్ల్యూ.ఓ. అని నమ్ముతున్నాను. నా పూర్తి సహకారం మీకుంటుంది.

నేను వెంటనే బయలుదేరి ఈ మేధావులందర్నీ పలక రించి, కౌగలించుకోవాలని వుంది." అన్నాడు ఉద్రేకంగా చైనీస్ సైంటిస్టు హోయాంగ్-హో.

ఆనందం పట్టలేక ప్రొఫెసర్‌ను గట్టిగా కౌగలించు కున్నాను. "థాంక్యూ వెరీమచ్ ప్రొఫెసర్. నేను బయలుదేరిన లక్ష్యం దాదాపు నెరవేరింది. మీ కెలా కృతజ్ఞతలు చెప్పుకోవాలో తెలియడం లేదు."

సమాధానంగా నవ్వి భుజంమీద తట్టాడు ప్రొఫెసర్. "ఇట్సాల్ రైట్. కాని మనం ఇప్పుడు ఈ విషవ్యూహం నుండి తప్పించుకోవడం ఎలా అన్న విషయం ఆలోచిం చాలి. మరో సంగతి!

నేను ఇంతకుముందు అమర్చిన యంత్రాలు - ఈ ఎడారిలో మరో అరగంటనుండి ప్రారంభమై రెండు గంటలపాటు కుంభవృష్టి కురిసేటట్టు చేస్తాయి.

మొదటి ప్రయోగంద్వారా ఈ చుట్టుప్రక్కల పది మైళ్ళ పరిధిలో వర్షం కురిసేటట్టు చేయడం జరిగింది. అయితే యిప్పుడు రేంజి పాతిక మైళ్ళకు మార్చాను."

"ప్రస్తుతానికి ఆ విషయం అలాగే వుంచండి ప్రొఫె సర్! మీకు కావాల్సిన అన్నిరకాల సహాయాలు N.W.O సంస్థ సగర్వంగా చేస్తుంది. పోతే, యిక్కడి సైనికబలం

మీకే బాగా తెల్సు కాబట్టి తప్పించుకొనే ఉపాయం మీరే ఆలోచించాలి.'' అంటూ బయటవున్న కాన్యోరా, సులేమాన్‌ల గురించి, సుడాన్ N.W.O. బ్రాంచ్ గురించి, వారి ప్రణాళిక గురించి చెప్పాను.

''వెల్ మిస్టర్. భయంకర్! ఈ భవనాన్కి వెనక వైపున ఓ చైనీస్ టాంకు వున్నది. అందులో క్షేమంగా పారిపోవచ్చు. నీ అనుచరులను—అక్కడికి—ఎలాగో కష్టపడి చేరుకోమని చెప్పు. కాని టాంకులో పారిపో తుంటే దాన్ని కాపాడే వ్యక్తికూడా ఒకరు, శత్రు సంహారం జరిగేదాకా ఇక్కడే వుండిపోవాల్సి వుంటుంది. ఎందుకంటే, యాంటీ టాంక్ గన్‌తోనో, లేదా యాంటీ-టాంక్ గ్రెనేడ్‌తోనో మా సైనికులు టాంకుకు ఆపద కల్గించే అవకాశం వుంది. మన ప్రయత్నం విఫలం అయితే - నేను యిక బ్రతికి వుండటంకల్ల. మీరంతా కూడా.''

''నో ప్రొఫెసర్! ఆపద తలపెట్టకండి. చివరి రక్తపు బొట్టువరకూ, మిమ్మల్ని క్షేమంగా పంపించడానికై పోరాడతాను.

నేను యిక్కడే వుండిపోయి, మీ టాంకుకు 'ఫాలో యింగ్' లేకుండా చూసుకుంటాను. తర్వాత జీపుమీదో, గుర్రంమీదో, ఒంటెమీదో, పారిపోయి ఎడారిదొంగల నాయకుడి స్థావరాన్ని చేరతాను. అక్కడ మనకోసం హెలికాప్టర్ ఎదురు చూస్తుంటుంది.'' గబగబా మాట్లా డాను.

''మిస్టర్ భయంకర్! ఈ ఎస్సైయిన్‌మెంట్‌లో నువ్వు ముఖ్యమైన వ్యక్తివి...''

''సందేహించకండి ప్రొఫెసర్. ముఖ్యమైన వ్యక్తిని

కాబట్టే మిమ్మల్ని శత్రువులనుండి కాపాడే బాధ్యత వహిస్తున్నాను.''

ప్రొఫెసర్ హోయాంగ్ హో భారంగా నిట్టూర్చాడు. ''ఆల్ రైట్ మేజర్. నువ్వు మెస్సేజ్ యివ్వు మీ అనుచరులకి. నన్నిక్కడ ఎవరూ అనుమానించరు కాబట్టి యిప్పుడే బయలుదేరి ఎలాగో ఆ టాంకులోకి చేరుకుంటాను.''

''ఓ.కే. ప్రొఫెసర్!'' అంటూ జర్కిన్ లోంచి వాకీ-టాకీ తీసాను.

అంతలో బయట ధన్...ధన్...మంటూ కాల్పులు విన్పించసాగాయి.

''మేజర్ భయంకర్! బయట కాల్పులు వినబడుతున్నాయి. మీ అనుచరుల ఉనికిని అప్పుడే పసిగట్టేసి ఉంటారు మా సైనికులు'' అన్నాడు కంగారుగా సైంటిస్టు హోయాంగ్ హో.

వాకీ-టాకీ చటుక్కున ఆన్ చేసాను.

''కాన్సోర్యా!'' పిల్చాను.

''ఎస్. భయంకర్! ఇక్కడ పరిస్థితి గందరగోళంగా ఉంది. మనచే చంపబడిన యిద్దరు గార్డులు కనబడకపోవడంతో అధికారుల్లో అనుమానం వచ్చింది. సెర్చింగ్ సాగింది. మేము యిక ఫెన్సింగ్ లోపలకి ప్రవేశించి హైరెక్టుగా రంగంలోకి దూకక తప్పలేదు. ప్రస్తుతం ఓ జీపుని కవర్ చేసుకుని కాల్పులు సాగిస్తున్నాం. ఇప్పటి వరకూ ఎటువంటి ప్రమాదం జరగలేదు. నో ఇంజరీస్'' గబగబా చెప్తోంది కాన్సోర్యా కాల్పులు సాగిస్తూనే.

''కాన్సోర్యా! మనం వచ్చిన పని సక్సెస్ అయింది. ప్రొఫెసర్ హోయాంగ్ హో అంగీకరించారు.''

"ఈజిట్ భయంకర్! వాట్ ఎ గ్రేట్ ప్లెషర్! నాలో ఉత్సాహం ఉరకలు వేస్తోంది" అంది శాన్యోరా.

"నువ్వొక పని చేయాలి. ఎలాగైనా, జాగ్రత్తగా ఈ బిల్డింగ్ వెనక ఉన్న ఒకే ఒక చైనీస్ టాంకులోకి మీరు ముగ్గురూ క్షేమంగా చేరుకోవాలి. టాంకు నడపడం వచ్చుకదూ నీకు?"

"ఎస్. మేజర్. ట్రైనింగ్ పీరియడ్‌లో శిక్షణ ఉంది."

"రైట్! ఆ టాంకులో ప్రొఫెసర్ కనబడతారు. మీరింకేమీ సందేహించకుండా, హరిహర బ్రహ్మాదులు దిగి వచ్చినా లక్ష్యం చేయక — అతి.వేగంతో తిన్నగా సులేమాన్ స్థావరం చేరుకోండి. అక్కడ్నుంచి హెలికాప్టర్‌లో పారిపోవాలి. ఈలోగా నేను యిక్కడి యిబ్బందుల్ని ఎదుర్కొని యెలాగో మిమ్మల్ని కలుసుకుంటాను. అర్థమైందా?"

"భయంకర్! నువ్వు మాతో రాకపోవడమేమిటి? నేను ఒప్పుకోను" గాభరాగా పల్కింది శాన్యోరా కంఠం.

"డోంట్ టాక్ నాన్సెన్స్ శాన్యోరా! ఎక్స్‌ప్లనేషన్స్ అడగకూడదని ముందే చెప్పాను. ఎస్. డబ్ల్యు. ఓ. హెలికాప్టర్‌కి ప్రొఫెసర్‌ని చేర్చేవరకూ ఆయన బాధ్యత అంతా నీదే. ఈలోగా నేను తప్పక వచ్చి సులేమాన్ స్థావరంలో కలుసుకుంటాను. ఓ. కే?"

రెండు క్షణాలు మౌనం.

"ఓ. కే. మేజర్! మేము యిప్పుడే టాంకుని చేరుకునే ప్రయత్నాల్లో ఉంటాం."

సర్క్యూట్-క్లోజ్ అయింది.

"గుడ్ లక్ ప్రొఫెసర్!" హోయాంగ్ హోతో కర చాలనం చేసాను. "నా రక్షణ విషయం నేను చూసుకుంటాను. మీరు వెంటనే వెనక ఉన్న టాంకులోకి చేరుకోండి."

సిగరెట్ ముట్టించుకొని, బీరువాలోని కొన్ని కాగితాలు తీసుకొని, కోటులోపల దోపుకొని దమ్ము పీలుస్తూ బయటికి వెళ్ళిపోయాడు ప్రొఫెసర్ హోయాంగ్ హో.

* * *

ధన్ ... ధన్ ... ధన్ ... ధన్ ...

ఎడారిలో ఒంటరిగా ఉన్న ఆ బిల్డింగ్ చుట్టూ కాల్పులు— మృత్యువిహారంలా వినపడుతున్నాయి.

భవనంలోను, బయటి ఆవరణలోనూ ఒక్కసారిగా అన్ని లైట్లు వెలిగి ఆ ప్రాంతాన్ని ప్రకాశవంతం చేసాయి. సిగరెట్ కేసులాంటి మినీ బైనాక్యులర్స్ కళ్ళ ముందు పెట్టుకొని రెండో అంతస్థునుంచి క్రిందకి చూసాను.

శాన్యోరా, ఆమె వెనుక సులేమాన్, ఖాన్, మెషిన్ గన్‌లతో కాల్పులు సాగిస్తూ బిల్డింగ్ వెనకవైపు వెళ్ళడానికి ప్రయత్నిస్తున్నారు.

ముగ్గురూ అస్తవ్యస్తంగా ఆగిఉన్న, జీపులనీ, ట్రక్కులనీ, అడ్డుగా పెట్టుకుంటూ ముందుకు కదులుతున్నారు.

చైనీస్ సైనికులు ఆమెను నాలుగువేపులనుంచీ చుట్టుముట్టే ప్రయత్నంలో ఉన్నారని ఊహించాను. అప్పటికే రెండువైపుల చేరి కాల్పులు సాగిస్తున్నారు. దాంతో, శాన్యోరా ఒకవేపు, ఖాన్, సులేమాన్ రెండోవేపు ఎటాక్ ఎదుర్కోవడం ప్రారంభించారు.

వాళ్ళని కాపాడాలి.

ఎలాగో టాంకువద్దకు చేరుకునేట్లు సహాయపడాలి!

నా మెదడులో ఓ ఆలోచన తట్టింది.

హడావుడిలో ఈ ఆలోచన శాన్యోరాకి వచ్చి ఉండదు.

అక్కడ ఉన్న రెండు ఎలక్ట్రిక్ స్తంభాలమీద నా దృష్టి నిల్చిపోయింది. బాల్కనీ గోడమీద మెషిన్ గన్ ఎక్కుపెట్టి రెండు నిముషాలపాటు పిచ్చిగా ప్రయోగించాను.

ధన్...ధన్...ధన్...ధన్...

మృత్యు గొలుసులా ధ్వనిస్తోంది మెషిన్ గన్.

రెండు ఎలక్ట్రిక్ పోల్స్‌కి ఉన్న ఫ్లోరసెంట్ దీపాలు భళ్ళుభళ్ళున ప్రేలాయి.

శాన్యోరా అప్పటిదాకా ఉన్న ప్రాంతం చీకటి అయిపోయింది.

"శాన్యోరా! రన్ ఫాస్ట్!" అని అరుస్తూ మొలవద్ద నుంచి హాండ్ గ్రెనేడు తీసాను.

ఇంతకుముందు గుంపులు గుంపులుగా వెంటాడిన సైనికులుండే ప్రదేశాన్ని గుర్తుపెట్టుకొని, లివర్ నోటితో లాగి బలంగా చీకట్లోకి విసిరాను హాండ్ గ్రెనేడు!

అంతే!!

ఢడాలున పెద్ద విస్ఫోటం!

ఓ జీపు "ఫట్" మంటూ పేలింది.

కవ్వున...ఆర్తనాదాలు.

దాదాపు పదిమంది చైనీయుల మృతదేహాలు ముక్కలు ముక్కలుగా గాలి కెగిరాయి!!

చైనీస్ మేజర్ చావో, క్రింద ఎక్కడో ఉండి కేకలు పెడుతున్నాడు. "యూ బ్లడీ యిడియట్స్! పైనుంచి

యెవరో కాలుస్తున్నారు. కొంతమంది బిల్డింగ్ లోకి ప్రవేశించండి. క్విక్!''

థాంక్ గాడ్!

నా ఊహ ఫలించింది.

ఇప్పుడు వాళ్ళ దృష్టి నామీద పడింది.

దీనితో—శాన్యోరావైపు ఒత్తిడి తగ్గవచ్చు.

మెషిన్ గన్ తో వరండాలోని లైట్లు టపటపా పేల్చాను!! ఇప్పుడు నే నున్న వరండా చీకటయ్యింది...

కొద్దిక్షణాల్లో సైనికులు పైకి వస్తారు.

* * *

నా కళ్ళు మూలగా వున్న స్టెయిర్ కేస్ ని ఆకర్షించింది.

గబగబా మెట్లెక్కి పైకి వెళ్ళాను.

ఓపెన్ టెర్రేస్!

డాబాలో అంతా ఖాళీగా ఉంది. టెర్రేస్ మీంచి క్రిందికి చూసాను.

నేలమీద—కాల్పులు వినబడుతున్నాయి.

ఉన్నట్టుండి నా హృదయం ఆనందంతో పరవశించిపోయింది.

బిల్డింగ్ వెనక వేపు...

టాంక్...

బలిష్టమైన చైనీస్ టాంకు, ఫెన్సింగ్ ని ఛేదించుకొని, ఇసుక బస్తాలమీదుగా, అవలీలగా బంకర్లు దాటీ, విజయగర్వంతో ఎడారిలోకి దూకుతోంది.

వాకీ_టాకీ ఆన్ చేసి శాన్యోరాని పిల్చాను.

"ఎవ్వరిథింగ్ ఈజ్ ఓ. కే. మేజర్! ప్రొఫెసర్‌తో బయలుదేరుతున్నాం. ప్లీజ్. భయంకర్! నువ్వూ వచ్చెయ్."

"ప్రస్తుతం చాలా కష్టం. శాన్యోరా! నీకు నా అభినందనలు! నీ ప్రాణాలు ఒడ్డయినా ముందడుగు వేసి—ఎలాగోలా ప్రొఫెసర్, ఎడారిదొంగల నాయకుడు సులేమాన్ స్థావరాన్ని చేరుకోవాలి. ప్రొఫెసర్‌తో నువ్వు బయలుదేరిన విషయం వైర్‌లెస్‌లో—నైరోబీకి చెప్పు. నేను ఎలాగో కష్టపడి శత్రువులకు 'మస్కా' కొట్టి అక్కడకు చేరుకోడాన్కి ప్రయత్నిస్తాను. కాని నా గురించి నువ్వు వేచి చూడొద్దు. ప్రొఫెసర్‌తో పోర్ట్ సుడాన్ బయలుదేరు. ఓవర్" అని సర్క్యూట్ క్లోజ్ చేసాను.

యధాలాపంగా క్రిందికి చూసి, ఉలిక్కిపడ్డాను. ఇద్దరు సైనికులు, పారిపోతున్న టాంకుకేసి తమ మధ్య ఉన్న ఆయుధానికి గురి చూస్తున్నారు.

అది యాంటిటాంక్ గన్!

అందులోంచి 'షెల్' దూసుకువెళితే-టాంక్ చైన్ లింక్ విడిపోయి టాంకు ఆగిపోయే ప్రమాదం ఉంది.

మెషీన్‌గన్ క్రిందికి వంచి ఆ ఇద్దరు సైనికుల్ని టపటపా కాల్చాను. వాళ్ళు గింగుర్లు తిరుగుతూ నేలకూలిపోయారు నిర్జీవంగా.

ఇంతలో—

"మేజర్ చావో! ప్రొఫెసర్ కనపడటంలేదు" అన్న సైనికుల కేకలు నా చెవులకు సోకాయి.

మళ్ళీ రెండో అంతస్థులోకి పరిగెత్తాను.

"అంతా మోసం! ప్రొఫెసర్ కూడా ఆ టాంకులో

పారిపోయుంటాడు. లేదా తీసుకుపోబడి ఉంటాడు. ఫూల్స్! మీ అందరి కళ్ళు మూసుకుపోయాయి. ఈ ఏడారిలో ఎక్కడున్నా సరే! జీపులో ఆ టాంకును వెంటాడాలి. యాంటిటాంక్ గ్రెనేడ్స్‌తో కొంతమంది నా కూడా రండి_మరి కొంతమంది వెళ్ళి శలవుపెట్టి మందుకొట్టి పడుకున్న కెప్టెన్ చుంగ్ మిన్‌ని నిద్రలేపండి. క్విక్ ఎవరిబడీ!'' అన్న కేకలు క్రిందనుంచి వినబకుతున్నాయి.

నా గుండె లదిరాయ్!

మరో ప్రమాదం_ఎక్కడో ఉన్న టాంకుకు.

నన్ను వెతకడానికి పైకి చొచ్చుకువస్తున్న చైనీస్ సిపాయిల్ని అడ్డు తప్పించుకుంటూ రివ్వున మెట్లు దిగ సాగాను.

లైట్లు పగలగా__బయటినుంచి వచ్చే అర్ధ కాంతిలో, ఆ గలాభాలో__చైనీస్ గార్డ్ దుస్తుల్లో ఉన్న నన్నెవరూ అనుమానించలేదు.

సులభంగా బిల్డింగ్ బయటికి వచ్చాను.

మేజర్ చావో ఆధ్వర్యంలో అప్పుడే ఓ జీపు హెడ్ లైట్ల కాంతితో ఒక్క జర్కులో ముందుకు కదిలింది.

నాలో తటాలున పిశాచం ఆవహించింది!!

చీకట్లోకి గెంతాను...

నా చేతిలోని మెషీన్‌గన్ "గజ్..." మంటూ మ్రోగింది...అంతే!!

జీపు వెనుక టైరు బుస్సుమంటూ గాలిపోయిన బెలూన్‌లా అణిగిపోవడం, మరో నాలుగు బుల్లెట్లు మేజర్ చావో_తలలో దూరిపోవడం...క్షణాల్లో జరిగిపోయాయి.

చావో, కిక్కురుమనకుండా జీపుమీంచి నేలమీదకి దబ్బున పడ్డాడు.

"మేజర్ మరణాన్ని చూసిన, జీపులోని మిగిలిన చైనీస్ సైనికులు భయంగా..."కాప్టెన్ చుంగ్ మిన్!
"కాప్టెన్ చుంగ్ మిన్!"
అంటూ అరవడం ప్రారంభించారు.

చోటు మార్చి, సురక్షితమైన ఓ చీకటి ప్రదేశంలో నక్కి, పరిస్థితి పరికించసాగాను.

అంతలో సుమారు ఇరవై ఎనిమిది సంవత్సరాలుగల యువకుడు అటువైపు, కాస్త తూలుతూ, తలవిదిలించు కుంటూ హడావుడిగా వచ్చాడు.

అతన్ని చూసి అందరూ శాల్యూట్ చేసారు. అతనే కాప్టెన్ చుంగ్ మిన్ అయివుండాలి." ఇప్పుడే మెసేజ్ వచ్చింది. మనలో భయంకర్ అనే ఇండియన్ మిలిటరీ మేజర్ వున్నాడు. మనమధ్యే వుండి మనల్ని చంపు తున్నాడు. మారువేషంలో వుండివుంటాడు. ముందు అతని గురించి వెతకండి. బిల్డింగ్ లోపలా, బయటా గాలించండి. క్విక్!" అంటూ అసహనంగా, చిందులు వేయసాగాడు చుంగ్ మిన్.

"ఇండియన్!" అన్నారంతా ఆశ్చర్యంగా. తర్వాత తమ పక్కవాళ్ళ ముఖాలకేసి, ప్రతి ఒక్కరూ అను మానంగా చూడసాగారు. అందరూ అటు, ఇటు చెల్లా చెదరయ్యారు.

వున్నట్టుండి ఆకాశంలో మేఘాలు దట్టమయ్యాయి. మరో క్షణంలో చిన్న జల్లుతో వర్షం ప్రారంభమై-మరు నిముషాన్నే వేగం పుంజుకొంది.

వర్షంలో తడుస్తూ, మామూలు సైనికుడిలా ముందుకి నడుస్తూ కాప్టెన్ చుంగ్ మిన్ని దూరంగా ఫాలో అవ సాగాను.

* * *

అది భవంతి వెనకవైపు వున్న—

ఓ చిన్న అవుట్ హౌస్...

కాప్టెన్ చుంగ్ మిన్ ఔట్ హౌస్ లోపలవున్నాడు. ఎవరితోనో ఏదో మాట్లాడుతున్నాడు...

కిటికీ గెడ, చిన్న ఊచతో పైకెత్తి, సన్నగా తలుపు లోపలికి తెరిచి—ఆ గదిలోకి చూడసాగాను...

లోపల రాడార్, మొదలైన రకరకాల మిలిటరీ యంత్ర సామగ్రి—కనబడ్డాయి. చుంగ్ మిన్ కాక, ఇద్దరు వ్యక్తులున్నారు లోపల. "ఫూల్స్! మావో మరణించాడని తెలియగానే, సంతాపం పేరుతో, మీరంతా నిద్రపోయి నా పీకలమీదకు తెచ్చారు." అంటూ అధికారదర్పం వుపయోగించి, ఆపరేటర్స్ని బూతులు తిట్టడం ప్రారంభించాడు కాప్టెన్ చుంగ్ మిన్.

దండకం ఆపి కాప్టెన్, ఓ టెలివిజన్లాంటి యంత్రం ముందుకు వెళ్ళాడు.

ఆ యంత్రంమీద వున్న అక్షరాల్ని చదివి అదిరి పడ్డాను...

సెల్ఫ్-టాంక్ ఇండికేటర్.

అంటే తమ స్వంత టాంకులు ఏఏ ప్రదేశాల్లో ఎంత దూరంలో వున్నాయో ఆ టెలివిజన్లాంటి యంత్రం, గుర్తిస్తుంది. బహుశా ఆ టాంకుకి—సెల్ఫ్ టాంక్ ఇండికేటర్ కి సంకేతాలు పంపే ఆటోమాటిక్ యంత్రమేదో అమర్చబడి వుంటుందన్నమాట.

"యంత్రం స్క్రీన్ మీద వెలిగిన పచ్చబల్బు చూసి బూటుకాలు, నేలకేసి తన్నాడు కాప్టెన్ చుంగ్ మిన్. "డామిట్! టాంక్ అప్పుడే యాభై మైళ్ళు దాటిపోయింది. ప్రొఫెసర్ని యిండియన్స్ చేతుల్లో ప్రాణాలతో వదిలి

పెట్టడానికి వీల్లేదు. రేంజి సరిగ్గా కాలిక్యులేట్ చేసి చెప్పు." అరిచాడు కోపంగా కేప్టెన్.

"మనటాంక్ అరవై ఐదు మైళ్ళ దూరంలో వుంది సార్. దిశ — సౌత్." అన్నాడు మొదటి ఆపరేటర్.

"అతి వేగంతో ప్రయాణించి వుండాలి. సార్!" అన్నాడు రెండో అతను చేతులు నలుపుకుంటూ.

"గుడ్. లాంచింగు పాడ్ కి వెళ్ళి, ఆ డిగ్రీలు ఎక్స్‌ప్లెయిన్ చేసి —, మినీ మిస్సాయిల్ ని పంపించి టాంకుని ఢీకొట్టమని చెప్పు..." అంటూ యింకా ఏదో చెప్పసాగాడు.

నాకిక, ఏమీ వినపడ్డంలేదు.

గుండె ఒక్క క్షణం కొట్టుకోడం మానేసింది.

కాన్వోయ్‌రా అరవై ఐదు మైళ్ళు ప్రయాణించింది. ఇందుకు ఓవిధంగా సంతోషిస్తుంటే మళ్ళీ ఈ మిస్సాయిల్ రాకెట్ ప్రమాదమా?

నా కంట్లో పిచ్చి ఆవేశం రగుల్కొంది.

వర్షం జోరున పడుతూనే వుంది. నిలువునా తడుస్తూనే వున్నాను. ప్రక్కకు కదిలి, వెలుగులోనికి వచ్చి — బోట్ హౌస్ తలుపు గడియపెట్టాను.

జర్కిన్ లో చేతులుపెట్టి రెండు హాండ్ గ్రెనేడ్లు బయటికి లాగాను.

మరుక్షణం వాటి లివర్లు నోటితో తెంపి, కిటికీ ఊచలకు వ్రేలాడగట్టాను.

తలుపులు దబదబ బాదుతున్నాడు కాప్టెన్. చుంగ్ మిన్ పిచ్చికేకలు వేస్తూ. చీకట్లోకి పరుగెత్తి మెషీన్ గన్ కిటికీవైపు గురిపెట్టాను. అంతే!...

"బజ్..." మంటూ పిచ్చిగా మ్రోగింది నా చేతిలోని మెషిన్ గన్.

"ఛ్...జ్...జ్..."

బుల్లెట్లు ఒకదానివెనక ఒకటిగా వెళ్ళి, కిటికీని వ్రేలాడుతున్న గ్రెనేడులను సూటిగా తాకాయ్.

అంతే!

భళ్ళున ప్రేలింది బోట్ హౌస్.

ఆపరేటర్లు, కాప్టెన్ చుంగ్ మిన్ దేహాలు, ఇటుక ముక్కలతో బాటు, ముక్కలు ముక్కలుగా గాల్లోకి ఎగిరాయ్.

ఇంతలో వెనుకనుంచి అడుగుల చప్పుడు వినవచ్చి నట్లయింది. అనుమానంగా వెనక్కి తిరగబోతుండగా ప్రక్కలో ఏదో గ్రుచ్చుకున్నట్లుంది...

అర్ధచీకటి...వర్షం...

అతను చైనీస్ సైనికుడిగా ఊహించాను.

"రాడార్ హౌస్ ఎందుకు పేల్చావ్?" అన్నాడతను క్రూరంగా.

"ఫూల్. అందులో యింతవరకూ మనల్ని చీల్చి చెండాడిన ఇండియన్ ఉన్నాడు" అన్నాను ధైర్యం కూడగట్టుకుంటూ.

అతనికి అనుమానం వచ్చినట్లయింది. ఎడిచేయి కదిపి, టార్చితీసి నా ముఖంమీద వెల్గించాడు.

మరుక్షణం...

"నువ్వు.. నువ్వు..." అంటూ నోరెళ్ళబెట్టాడు.

"అవును. నేనే మేజర్. భయంకర్!—ఫ్రమ్ ఇండియా!" అంటూ హటాత్తున చెయ్యెత్తి అతని నెత్తి మీద మెషిన్ గన్ తో మోదాను.

అంతే!

చిన్నగా మూల్గి, నేలమీదకు బరువుగా వాలిపోయాడతను.

ఆ ఆవేశంలో, దగ్గర్లో ఉన్న రెండులైట్లు భళ్ళున పేల్చేసాను.

దగ్గర్లో ఉన్న ట్రక్కులో కూర్బొని, ఇగ్నీషియం తెంపి, వైర్లు కలిపి, వాహనాన్ని స్టార్టుచేసి బిల్డింగ్ వెనక ఉన్న ఫెన్సింగ్ మీదకు ఉరికించాను. ఫెన్సింగ్ కూలిపోయి, ఇసుకలో కూరుకుపోగా ట్రక్కు చరచరా ముందుకు కదిలింది.

అప్పటికే నా శరీరం తడిసి ముద్దయింది. వర్షం నిముష నిముషానికి తీవ్రస్థాయి నందుకుంటూ కుంభవృష్టిగా మారింది.

ఫర్లాంగు దూరం దాటిన తర్వాత మేము అంతకు ముందు ఉపయోగించిన జీపు ఒంటరిగా కనబడింది. ట్రక్కు ఆపి ఆ జీపులోని రెండో వైర్లెస్ సెట్ అందుకొని మళ్ళీ ట్రక్కుని ముందుకి కదిలించాను.

ఉరుములు... మెరుపులు!!

వాతావరణం, గందరగోళంగా, భయానకంగా తోచింది.

సైంటిస్ట్ హూయాంగ్ హో మాట నెరవేరింది. అతను ఫిక్స్ చేసి వదిలిపెట్టి వెళ్ళిన ప్రయోగ ఫలితమే ఈ కుంభవృష్టి.

ఇలాంటివే ఇంకో నాలుగు వర్షాలు పడితే, ఈ ఎడారిలో పచ్చని మొక్కలు మొల్చినా ఆశ్చర్యపోనక్కరలేదు.

హెడ్ లైట్ల కాంతిలో సర్రున ముందుకు పరుగెత్తుతోంది హెవీ మిలటరీ ట్రక్కు!!

అప్పుడు శాస్త్ర తేలిక దొరికినట్లయింది. ఓ సిగరెట్ ముట్టించి, గట్టిగా దమ్ములాగి ఆక్సిలేటర్ అదుక్కుంటూ తొక్కాను.

సివంగిలా పరుగెట్టసాగింది ట్రక్కు.

*　　　*　　　*

మరో పదిహేను నిముషాలు గడిచాయి.

వర్షం జోరున కురుస్తూనే వుంది.

ట్రక్కు కాబిన్ మీద దబదబా వర్షపు చప్పుడు.

ఆకాశంలో భయంకరమైన మెరుపులు...ఉన్నట్టుండి—

ఉలిక్కిపడ్డాను.

ట్రక్కు ఎదురుగా ఫర్లాంగు దూరంలో—

ఆకాశంలోంచి...

పెద్ద మెరుపు!!

క్రిందకు, రివ్వున దిగుతోంది.

నా గుండెలు దడదడలాడాయి...

ఆ కాంతి...

ఆ విద్యుత్ రేఖ...!!

భగవాన్!!

అయోమయం—

చూళ్ళేకపోతున్నాను...

అంతే!

కాంతిరేఖ భూమికి తాకి...భడాలున శబ్దం...

ఆటమ్-బాంబ్ పగిలినట్లు చప్పుడు...

దిశదిశలు—దద్దరిల్లే శబ్దం...

నా శరీరం ఒక్కసారి గడగడా వణికింది...

అవును...ఏమయింది నాకు!?

భగవాన్! యిది నిజమేనా???

నా కళ్ళు...క...న...పడటం లేదు!!

ఏవిటి?

హెడ్ లైట్ల కాంతి కనబడటంలేదు!!

నేను... నేను...గుడ్డివాడ్నయిపోయాను!!

అంటే!

అది...పిడుగు!!

పిడుగు కాంతి...

గజగజ వణికిపోతున్న శరీరంతో, ఎలాగో ట్రక్కు బ్రేకు నొక్కాను. ట్రక్కు ఆగింది.

ఎదురుగుండా ఏమీ కనబడ్డంలేదు. కళ్ళు నులుముకుని చూసాను...ఊహుఁ! ఏమీ కనబడ్డంలేదు.

కళ్ళముందు కేవలం కాటుకలాంటి అంధకారం!...

నాకు ఏడుపు వస్తోంది...

యిది నిజమేనా?—

శరీరం చమటలు పడుతోంది...

వణుకుతున్న చేతులతో, జర్కిన్ లోపల తడుముకుని అగ్గిపెట్టె బైటికి తీసాను.

పుల్ల గీసాను...

సర్...అగ్గిపుల్ల అంటుకున్న చప్పుడు...

కాని...

కానీ...

అగ్గిపుల్ల కాంతి—అణుకంతైనా—కనుపాపలకు కనబడ్డం లేదు...

చలిజ్వరంలాంటిదేదో, నా శరీరంలోకి అణువణువునా వ్యాపించింది...

"అయ్ హావ్ బికమ్ బ్లైండ్"

"అయామె బ్లైండ్ మాన్!..."

"నేను గుడ్డివాడ్ని!"...

పిచ్చెక్కినట్టు అరిచాను...

కళ్ళకెదురుగా కాటుక చీకటి...

ఎదురుగా చీకటేమిటి?

కళ్ళకే చీకటి!

కళ్ళే చీకటి!

చీకటిపడిన కళ్ళు...

నిన్న నేను చూసిన పగలే, ఆఖరి పగలు...

మరో అయిదు గంటల్లో రాబోయే సూర్యకాంతిని నేను చూడలేను.

అదొక్కటే కాదు!

జీవితాంతం సూర్యకాంతిని చూడలేను.

నేనిప్పుడెక్కడికి వెళ్ళాలి?

ఎలా వెళ్ళాలి??

అగ్గిపుల్లలన్నీ టపటపా గీసిపారేసాను.

ఊహుఁ—'సర్' మంటూ అంటుకున్న చప్పుడే వినబడుతోంది.

సందేహం లేదు...

నేను గ్రుడ్డివాణ్నయిపోయాను. ఇప్పుడేం చెయ్యను?

అంతలో ... కుడివేపు ... కొంతదూరం వెనకగా వాహనం కదిలిన అలికిడి.

"షూట్ హిమ్! అదుగో ... వాడే మన కాప్టెన్నీ! మేజర్నీ చంపిన బ్లడీ యిండియన్ - మేజర్ భయంకర్ పిచ్చికుక్కలా కాల్చండి..."

ఆ కంఠం వెనకే గజగజా మ్రోగిన మెషిన్‌గన్ చప్పుడు. "అబ్బా!" కెవ్వున అరిచాను. కుడిభుజంలోను, పొట్ట కుడిభాగంలోను, కుడి తొడలోను దాదాపు పది

పేను కాలిన యినుపకణికలు దూరాయ్. ప్రాణం పోతోంది. నోరారుచుకపోతోంది. ఎడంభుజాన్ని నీరసంగా కదిపి సీటు ప్రక్కలో వున్న మెషిన్ గన్‌ని అందు కున్నాను. "రాస్కెల్స్! గుడ్డివాడ్ని చంపుతున్నారు!" పళ్ళు పటపటా కొరికి, మాటల శబ్దం వచ్చిన స్పాట్ ఊహించి...ధన...ధనా...మోగించాను.

ధన్...ధన్...ధన్...ధన్...అటూ ఇటూ త్రిప్పు తున్నాను...దాదాపు పది నిముషాలు మెషిన్ గన్ మ్రోగుతూనే వుంది.

కెవ్వన ఆర్తనాదాలు...

వాహనపద్దాలు పగిలిన చప్పుడు...నాలుగు వందలు పైగా బుల్లెట్లు ఖర్చయ్యాయి. ఖాళీ అయిపోయి, వేడెక్కిన మిషన్‌గన్ విసిరికొట్టాను. జర్కిన్‌లో మిగిలిన మరో రెండు హాండ్ గ్రెనేడ్లు కసిగా విసిరాను...

ధడేల్...ధడేల్...

కాసేపు తర్వాత ఆ ప్రదేశం నిర్మానుష్యమైనట్టు నిశ్శబ్దం...

కేవలం!

సన్నటి చినుకులచప్పుడు...!!

చెవులు రిక్కించాను రెండు నిముషాలపాటు...

నో రెస్పాన్స్!...

ఎదురు కాల్పులు లేవు...

చచ్చారు వెధవలు! నోరారుచుకపోతుంటే చీకట్లో మెల్లిగా కదిలాను. అంతే! కుడివేపు డొక్కలో కరకర ఏదో కలికబడుతూ కదిలినట్టు తట్టింది...

కుడిచెయ్యి పని చెయ్యడంలేదు...ప్రాణం జిల్లారుచుకు పోతోంది...రక్తపు మడుగు, సీటుక్రింద చిక్కగా, జిగురుగా తగిలింది...

తుది నిముషాలు ..

బయటికి సాచిన ఎడంచేతిలో కానిని వర్ష పుచుక్కలు పడ్డాయి. దానితో పెదాలు తడుపుతున్నాను.

తిరిగి అదే చేత్తో తడుముకుంటూ వైర్‌లెస్ సెట్ అందుకొని ఆన్ చేసాను.

"దిసీజ్ ...డిసర్టు...హంటర్ ..."

"హల్లోవ్ భయంకర్! నైరోబీని మాట్లాడుతున్నాను. కంగ్రాచ్యులేషన్స్! ఇక ప్రమాదం తప్పింది. కాన్స్యోరాతో నువ్వు కల్సి వెళ్ళలేదట. ఎందుకని? ఇప్పుడు ఎక్కడున్నావు?"

ఆయాసంతో ముందుకు తూలిపోతూ యెడంచేత్తో దేనినో పట్టుకున్నాను.

"ప్లీ...జ్ ...నైరోబీ...ప్రశ్నలు...వద్దు...హౌ...ఈజ్ కాన్స్యోరా?"

"షీ ఈజ్ ఓ. కే. మిస్టర్ భయంకర్! ఇప్పుడు ఆమె, ప్రొఫెసర్ హోయాంగ్‌తో హెలికాప్టర్‌లో సుడాన్ వైపు ప్రయాణిస్తున్నారు. మరో అర్ధగంటలో వారిని రిసీవ్ చేసుకుంటాను. ఎంత ఆలస్యమైనా మీరు సులేమాన్ స్థావరాన్ని చేరుకోకుండా తాను బయలుదేరనని చాలసేపు కాన్స్యోరా మొండికెత్తిందట! మా పైలట్ బలవంతంగా లాక్కొస్తున్నాడు. ప్లీజ్ భయంకర్! మీరు యెక్కడ వున్నారో చెప్పండి. ఈ ఎస్సయిన్‌మెంట్ విజయవంతంగా నెరవేర్చి మరో ప్రపంచ సంస్థ యొనలేని సహాయాన్ని చేశారు. ముందు చెప్పండి! వేర్ ఆర్ యూ?"

పేలవంగా నవ్వాను.

నొప్పి...

పొట్ట బలంగా పట్టుకొని పెదవులు కదిపాను.

"ఎక్కడ ఉన్నానో... చెప్తాను... వినండి. మరో ప్రపంచానికి... ముఖ... ద్వారంలో..."

"వాట్ డు యూ మీన్ మేజర్ భయంకర్?"

"ఎస్... మిస్టర్ నైరోబీ... ఐయామ్ గోయింగ్... టు డై... మరో నిముషంలో చావబోతున్నాను... పొట్టలో... భుజాల్లో... తొడల్లో కలిపి దాదాపు యిరవై... బుల్లెట్లు... కాళ్ళ క్రిందా... చేతుల క్రిందా రక్తపు... మడుగు జిగటగా తగుల్తోంది..."

"భయం... కర్!"

అవతలివైపు కేక!

"ఒక్క విషయం... చెప్పండి నైరోబీ... వారిద్దరూ... క్షేమంగా... క్షేమంగా... ఉండి... యా...?"

"ఆ విషయంలో సంకోచం అవసరంలేదు... నేనే స్వయంగా మారువేషాల్లో కాన్యోరా, ప్రొఫెసర్‌లతో బయలుదేరి ఇండియా చేరతాను. కాని మిమ్మల్ని ముందు బ్రతికించమని."

"నో... మిస్టర్ నైరోబీ... వీల్లేదు... ఆఁ... మీ విధి... నిర్వహణలో మీరు నిమగ్న... మవ్వండి. కనీసం నా శవాన్ని వెతికించడానికి టైం వేస్టు చేసినా... నా మీద ఒట్టే... అది సరే... వాకీటాకీలో, అంత యెత్తులో దూరంగా ఉన్న... కాన్యోరా... తో మాట్లాడలేను... ఆమెతో... చివరి... సారిగా... రెండే రెండు... మాటలు..."

"డోంటో వర్రీ మేజర్! హెలికాప్టర్ వైర్‌లెస్‌కి నా వైర్‌లెస్ కనెక్షన్ యిస్తాను. అరనిముషంలో ఆమె కంఠం మీకు వినబడుతుంది..."

ఎగిసిపడే గుండెల్తో బరువుగా వెనక్కి వాలాను.

ఒకటి...

రెండు... సెకన్లు... భారంగా గడుస్తున్నాయి.

ఉన్నట్టుండి నా శరీరం తేలికపడుతున్నట్లయింది...

తల గిర్రున తిరుగుతున్న అనుభూతి...

తెలివి తెచ్చుకోబోయి తల విదిలించబోయాను...

నా ప్రయత్నం ఫలించ లేదు.

లోపల ఏదో__లాగుతుంది.

గుండె ఆగిపోతున్నట్టు...

ఊపిరితిత్తులు ఖాళీ అవుతున్నట్టు...

భయంకరమైన అనుభూతి.

నోరావలించి గుటకలు మ్రింగాను.

గాలిలో తేలిపోతున్నాను.

"భయంకర్! భయంకర్! నేను శాన్యోరాని! ప్లీజ్ టాక్!" శాన్యోరా కేకలు మైక్‌లో లీలగా వినబడుతున్నాయి.

జవాబివ్వాలి...

జవాబివ్వాలి...

"శా..." నోరావలించి, అర్ధస్పృహలో...

ప్రక్కకి కదలబోయి ట్రక్కు డ్రైవింగ్ సీటులో వచ్చి నేలమీద దబ్బున పడ్డాను.

శాన్యోరా, బార్బరా, జోనా నా స్మృతిపథంలో ఒక్కసారి మెదిలారు...

ఆ తర్వాత ఏమైందో నాకు తెలియదు.

—: సమాప్తం :—